ఫీల్డ్ అసిస్టెంట్ల వేతన వెతలు

- మూడు నెలలుగా అందని జీతాలు
- భారంగా కుటుంబ పోషణ

పాన్‌గల్: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్రియాశీలక పాత్ర వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు వేతనాల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నెలలుగా వేతనాలు పడకపోవడంతో జీతాలపై ఆధారపడ్డ వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు.

పనుల కల్పనలో ముఖ్య భూమిక..

గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారు. పనుల ఎంపిక, కూలీలు హాజరయ్యేలా వారిలో చైతన్యం తీసుకురావడం, రిజిస్టర్లలో వివరాల నమోదు వంటి పనులు చేపడుతున్నారు. పథకం పక్కాగా నిర్వహించేందుకు ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం (ఎన్‌ఎంఎంఎస్)ను గత ఆర్థిక సంవత్సరం ప్రారంభించింది. ఫీల్డ్ అసిస్టెంట్లు పనులకు వచ్చిన కూలీల పేర్లు నమోదు చేసుకొని, వారి ఫొటో తీసి యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. పని పూర్తయిన తర్వాత మరో దఫా చిత్రం తీసి అందులో పొందుపర్చే బాధ్యతలు వారికి అప్పగించారు. ఇలాంటి వాటిని చేపడుతున్నా సకాలంలో జీతాలు


తెల్లరాళ్లపల్లితండాలో కూలీల వివరాలు నమోదు చేసుకుంటున్న ఎఫ్‌ఏ సోమ్లానాయక్ (ఫైల్)

రాక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పని దినాలు కల్పించిన వారిని కేటగిరీలుగా విభజించారు. అత్యధిక కేటగిరీ వారికి నెలకు రూ.12,200, రెండో దశ ఎఫ్‌ఏలకు రూ. 9వేలు, మూడో కేటగిరీ చెందిన ఎఫ్‌ఏలకు రూ.7,700 వేతనంగా నిర్ణయించారు.

మండల పరిస్థితి....

మండలంలోని 28 జీపీల్లో 15 మంది దాక ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తుండగా, మిగిలిన ప్రాంతాల్లో సీనియర్ మేట్లు విధులు నిర్వహిస్తున్నారు. వారికి జనవరి, ఫిబ్రవరి, మార్చి(3 నెలల) వేతనాలు అందాల్సి ఉంది. ఇప్పటికే ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్య విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయి వేతనాలు విడుదల చేయాలని మండలంలోని ఎఫ్‌ఏలు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే విడుదల చేసి సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించాలి. రెగ్యులర్‌గా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారి, అప్పుల చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్‌గా వేతనాలు అందేలా తగు చర్యలు తీసుకోవాలి.

– బీరయ్య,
ఎఫ్‌ఏ మండల అధ్యక్షుడు, కేతేపల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం



ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. ఉపాధి హామీ సిబ్బందిలో టెక్నికల్ అసిస్టెంట్లకు మినహా మిగతా వారికి సంబంధించిన వేతనాలు మూడు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు నివేదించాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

ఇట్టి విషయంపై ఏపీఓ కుర్మయ్యను వివరణ కోరగా ఎఫ్‌ఏల వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే అన్నారు. వేతనాల మంజూరుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

మాదిగల ఐక్యత ర్యాలీ



చిన్నంబావి: మాదిగల ఐక్యత కోసం చిన్నంబావి మండల కేంద్రంలో త్వరలో 2000మందితో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు మాదిగల ఐక్యవేదిక నిర్ణయం తీసుకుందని ఆ సంఘం అధ్యక్షుడు రమేష్ మాదిగ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో 17గ్రామ పంచాయతీల నుంచి మాదిగల ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన రంజిత్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మాదిగల ఐక్యత కోసం ఒక ప్రత్యేక వేదిక ద్వారా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికి గ్రామాల్లో మాదిగలు అంటరానితనాన్ని ఎదుర్కొంటున్నారని, కలిసికట్టుగా ఉండి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మండల కేంద్రంలో అన్ని హంగులతో అంబేడ్కర్ భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో వడ్డెమాన్ బిచ్చన్న, రామకృష్ణ, నరసింహ, చారకొండ బాబు, శ్రీనివాసులు, నాగరాజు, డప్పు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గిన్నిస్ బుక్ రికార్డులో పాస్టర్ జీసీ పాల్‌కు చోటు

కొత్తకోట: వనపర్తి జిల్లా కొత్తకోట మండలానికి చెందిన యేసు ప్రభువు ప్రార్థన మందిరం నడుపుతున్న జీసీ పాల్ కు గిన్నిస్ బుక్‌లో చోటు దక్కింది. వివరాలు.. కొత్తకోట మండల కేంద్రానికి చెందిన పాస్టర్ జీసీ పాల్ సువార్త క్రిస్టియన్ సంగీత పోటీల్లో గిన్నిస్ రికార్డు సాధించాడు. గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ సంగీత పోటీల్లో పాల్గొని, తన సంగీత బృందంతో కలిసి ఒక గంటలో 1,046 సంగీత వీడియోలను అప్‌లోడ్ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 14న హైదరాబాద్‌లో గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈ మేరకు జరీనా ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో చోటు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని పాల్ ఆనందం వ్యక్తం చేశారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా, తాగునీటి ఎద్దడి రాకుండా పకడ్బందీ ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మేడేపల్లి గ్రామంలో రికార్డులను పరిశీలించి సమస్యల గురించి ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులు, కార్మికులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. అలాగే నర్సరీలను సందర్శించి మొక్కలు వాడిపోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించినట్లు తెలిపారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శిరీష, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సబ్సిడీతో అందించే రుణాలకు సంబంధించిన దరకాస్తులు సమర్పించాలని ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లో దరకాస్తులు స్వీకరించారు. మండలంలోని అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నవారు రేపటిలోగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు. మొత్తం 1,150 మంది దరకాస్తులు చేసుకోగా.. 805 మంది దరకాస్తులను అందించారని వివరించారు. అలాగే స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో 415 మంది దరకాస్తులు చేసుకున్నారని కమిషనర్ శశిధర్ తెలిపారు.

బోరు మోటారు ఏర్పాటు చేయాలి



వనపర్తి రూరల్: మంలంలోని కాశీంనగర్ గ్రామంలో తాగునీటి బోర్లకు సింగిల్ పేస్ మోటార్లను ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ రాములు, గ్రామస్తులతో కలిసి మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రాఘవను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో త్రీ పేస్ కరెంట్ సమస్య ఉన్నందున సింగిల్ పేస్ మోటార్లను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు.

అంబలి కేంద్రం ప్రారంభం



ఆత్మకూర్: పట్టణంలో వందే రామధూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అంబలి కేంద్రం ప్రారంభించారు. నిత్యం రాగి అంబలి పంపిణీ చేస్తున్నామని, వేసవి ముగిసే వరకు అంబలి కేంద్రం కొనసాగుతుందని నిర్వాహకులు ధర్మాపురం శ్రీనివాసులుశెట్టి, శివనారాయణ, గిరిధర్, పద్మ తెలిపారు.

మైక్‌సెట్ వితరణ

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలకు గతంలో హెచ్‌ఎంగా పనిచేసిన వెంకటేష్‌యాదవ్ కృషి ఫలితంగా రూ.12 వేల విలువ గల మైక్‌సెట్‌ను ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ లెక్చరర్ సురేందర్‌రెడ్డి వితరణగా ఇచ్చారు. వితరణగా అందజేసిన మైక్‌సెట్‌ను మంగళవారం ఎంఈఓ శ్రీనివాసులు చేతుల మీదుగా పాఠశాల ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. దాతల తోడ్పాటు మరువలేనిదన్నారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖాసీం, సీఆర్పీ సంతోష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వజ్రోత్సవ సభ విజయవంతం చేద్దాం

గోపాల్‌పేట: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ వజ్రోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీది చీకటి ఒప్పందం అని ఆరోపించారు. కాంగ్రెస్‌ను తిడితే బీజేపీ కోపం వస్తుందని, అలాగే బీజేపీని తిడితే కాంగ్రెస్‌కు కోపం వస్తుందని ఎద్దేవాచేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముద్దుబిడ్డ ఎలా అవుతాడని ప్రశ్నించారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడేది


మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కేవలం కేసీఆర్ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మీడియా కన్వీనర్ అశోక్, గోపాల్‌పేట మండల అధ్యక్షుడు బాల్‌రాజు, తిరుపతయ్య, చంద్రశేఖర్, శేఖర్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి న్యాయం చేయాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూర్, అమరచింత మండలాలకు చెందిన రైతులు వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు చివరి దశలో ఉన్నాయని, వాటికి సాగునీరు అందించాలన్నారు. ఈ విషయమై జూరాల ప్రాజెక్టు ఈఈతో ఫోన్‌లో మాట్లాడగా.. సాగునీరు అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామని, పంటలు ఎండకుండా ఉండేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి అవాంతరాలు తలెత్తకుండా పకడ్బంది చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ప్రాజెక్టు అధికారులకు సూచించారు.

‘సనాతన ధర్మమే శ్రీరామ రక్ష’


పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వనపర్తిటౌన్: అనాది నుంచి ఉన్న సనాతన ధర్మ పరిరక్షణతోనే లోకం సుభిక్షంగా ఉంటుందని, హిందువులు ఐక్యమత్యంతో సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు భాగస్వాములు కావాలని జగద్గురు కాంతేంద్ర స్వామిజీ ప్రబోధించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పాతబజార్ కాశికాంబ సమేత కమతేశ్వర ఆలయ పునఃప్రతిష్ఠలో పాల్గొని ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మం వైభవాన్ని శ్రీరాముడు నిలబెట్టారని కొనియాడారు. సర్వమానవాళి, జీవరాశి సుభిక్షంగా, క్షేమంగా ఉండాలని ప్రతిరోజు ప్రార్థించే ఔన్నత్యం కలిగిన సనాతన ధర్మం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పుట్టిన రోజు వేడుకలతో సంబురాలు కాకుండా తోటివారికి తోడ్పాటునందించే చర్యలకు పూనుకోవడం ద్వారా మానవత్వ బీజానికి శ్రీకారం చుట్టినట్లు అవుతుందని చెప్పారు. హంగులు, ఆర్భాటాలు, అనవసర ఖర్చులు చేయకుండా నిశ్చల భక్తితో భగవంతుడిని ఆరాధించాలని తద్వార ధర్మ మార్గం అలవడుతోందన్నారు. అంతకుముందు వేకువజాము నుంచి సుప్రభాత సేవతో ప్రారంభించిన వేద పండితులు హోమాలు, విగ్రహ పంచామృత స్నానం, జలాధివాసం, క్షీరాధివాసం తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. పట్టణమంతా వేద పండితుల మంత్రోచ్ఛరణలతో మార్మోగింది. అంతకుముందు కమతేశ్వర స్వాముల ఊరేగింపు, పల్లకీ కనులపండువగా సాగింది. బుధవారం ఆలయంలో శ్రీకాశికాంబ సమేత కమతేశ్వరస్వామి మూర్తులను పునఃప్రతిష్ఠ చేయనున్నారు.

ముగిసిన చింతల మునిరంగస్వామి ఉత్సవాలు

అమరచింత: మండలంలోని పాత ఈర్లదిన్నెలోని జూరాల బ్యాక్ వాటర్‌లో వెలసిన చింతల మునిరంగస్వామి జాతర మంగళవారం ముగిసింది. సోమవారం రాత్రి ఈర్లదిన్నె నుంచి జూరాల బ్యాక్ వాటర్‌లోని పాత ఈర్లదిన్నెలో ఉన్న ఆలయం వరకు రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మంగళవారం స్వామివారికి పొటేళ్లను బలిచ్చి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి పిండివంటలతో నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఆలయానికి గద్వాల, వనపర్తి జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడిందని ఆలయ పూజారి నాగిరెడ్డి తెలిపారు.


ఉత్సవాలకు హాజరైన భక్తులు

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

గోపాల్‌పేట: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ మంగళవారం హెచ్చరించారు. శనివారం, ఆదివారం క్రితం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో పట్టుబడిన ఇద్దరిని మంగళవారం కోర్టులో హాజరు పర్చగా.. రెండో అదనపు న్యాయమూర్తి ఒక్కొక్కరికి ఆరు రోజుల పాటు జైలుశిక్ష విధించారని ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

మహిళ అదృశ్యం

వనపర్తి రూరల్: పట్టణంలోని తిరుమల కాలనీకి చెందిన మహిళ ఈ నెల 11 నుంచి కనిపించడం లేదని ఆమె కుమారుడు వంశీ మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. పట్టణంలోని తిరుమల కాలనీకి చెందిన చిట్టెమ్మ కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ నెల 11న ఉదయం ఇంటి నుంచి పనికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టుపక్కల తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు వంశీ మంగళవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సుధాకర్‌యాదవ్ మాతృమూర్తి మంగదొడ్డి చంద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, వెంకటయ్యనాయుడు, వీరసాగర్, తిరుపతియాదవ్, రమేష్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు మౌనికయాదవ్, బాలస్వామియాదవ్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్..

మృతురాలి కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట విండో డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్ బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

ఆశీర్వాదానికి నివాళి

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆశీర్వాదం వర్ధంతిని పురస్కరించుకొని సీపీఎం నాయకులు ఎండీ జబ్బార్, పుట్ట ఆంజనేయులు, పరమేశ్వరాచారి, కురుమయ్య, గంధం మదన్, పలువురు నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమరశీల నాయకుడిగా సీపీఎంలో పని చేస్తూ, ఎంతో మందిని నాయకులుగా తయారు చేసి పార్టీలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. యువజన సంఘం నాయకులు, కార్యకర్తలకు వయోజన విద్యనందించి ప్రయోజకులను చేశారని కొనియాడారు. సోషలిజం సాధన కోసం పరితపించారన్నారు. కార్యక్రమంలో రాబర్ట్, గంధం గట్టయ్య, నందిమళ్ల రాములు, ఎల్ బీసన్న, రత్నయ్య, పుల్లయ్య, మన్యం, ఆంజనేయులు, దేవరాజు, బాలరాజు, శ్రీనివాసులు, రవి, బాలపీర్, గొర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఆశీర్వాదం స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

3 ఇసుక టిప్పర్ల పట్టివేత

ఖిల్లాఘనపురం: మండలంలోని పిల్లి వాగు నుంచి రాత్రివేళ అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. సోమవారం రాత్రి ఎలాంటి అనుమతి లేకుండా వాగు నుంచి ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లు, ఓ మినీ డీసీఎం ను పట్టుకొని కేసునమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్‌కు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళల హక్కుల సాధనకు ఉద్యమిస్తాం

పాన్‌గల్: మహిళల హక్కుల సాధన, ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐద్వా సంఘం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు చిట్టెమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మహిళలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యానని మండిపడ్డారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించకపోవడంతోనే దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో కొన్నింటిని


సమావేశంలో చర్చిస్తున్న ఐద్వా సంఘం సభ్యులు

మాత్రమే అమలు చేసి మిగితా వాటిని గాలి వదిలేశారని ఎద్దేవా చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోకపోతే మహిళలతో కలిసి ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం నాయకురాలు అనిత, శాంతమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

వనపర్తి రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ హాజీరాబేగం తెలిపారు. పోషకాహార వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని చిట్యాల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ విద్యార్థులు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి పోషకాలు లభిస్తాయన్నారు. రోజు తీసుకునే ఆహారంలో పోషక విలువలున్న ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు, గుడ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు.


లబ్ధిదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ హాజీరాబేగం

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

వనపర్తి రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్ అన్నారు. మంగళవారం మండలంలోని కాశీంనగర్‌లో సింగిల్ విండో ద్వారా ఏరాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయనతో పాటు మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యంతో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్, భూమి పాస్‌పుస్తకం ధ్రువపత్రాలు తీసుకొస్తే.. ప్రభుత్వం ధాన్యం డబ్బులు నేరుగా రైతు ఖాతాల్లో జమచేస్తుందన్నారు. రైతాంగం దళారి వ్యవస్థను ఆశ్రయించరాదని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి సన్న రకాలకు మద్దతు ధర పాటు బోనస్ పొందాలని సూచించారు.


కాశీంనగర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

సురక్షిత భారతాన్ని నిర్మిద్దాం



వనపర్తి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఫైర్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా అరికట్టాలో ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు కరపత్రాలు పంచడం, పోస్టర్స్ గోడలకు అంటించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. సురక్షిత భారతాన్ని నిర్మిద్దాం అంటూ నినదించారు. కార్యక్రమంలో సిబ్బంది ఏసీ నరసింహారెడ్డి, ఐసీ ఎస్‌ఎఫ్‌ఓ శ్రీనివాసులు, కుర్మయ్య, సలీం, బాలకొండ, శివ, బుచ్చిబాబు, జైపాల్‌రెడ్డి, రాము పాల్గొన్నారు.

ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బస్టాండ్, శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఫైర్ సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో క్లుప్తంగా చూయించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవా ల్లో భాగంగా ప్రజలు ప్రమాదాల బారిన పడ్డప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది కృష్ణ, రాముడు, నాగార్జున, నర్సింహారెడ్డి, వెంకటనర్సయ్య, భీమేశ్వర్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

స్ప్రింక్లర్ పైపుల పంపిణీ

పాన్‌గల్: గోప్లాపూర్ గ్రామానికి చెందిన రైతులకు సబ్సిడీ ద్వారా అందిన స్ప్రింక్లర్ పైపులను మంగళవారం రాత్రి గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్‌తో కలిసి జూపల్లి అరుణ్ పంపిణీ చేశారు. స్ప్రింక్లర్ పైపులతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు చోట్ల హైమాస్ట్ లైట్లు ప్రారంభించడంతో పాటు మహేష్‌కు రూ.16,500, నాగన్నకు రూ.60 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు, రాముయాదవ్, పుల్లారావు, భాస్కర్‌యాదవ్, బ్రహ్మయ్య, ప్రసాద్‌గౌడు, దశరథ ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి


అభివాదం చేస్తున్న బీజేపీ నాయకులు

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురంలో బీజేపీ నాయకుడు బక్కగాంధీ ఆధ్వర్యంలో ఆ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు చవ్వ సాయిలు బీజేపీలో చేరగా.. బీజేపీ రాష్ట్ర నాయకుడు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ బీజేపీ అధ్యక్షుడి చవ్వ సాయిలు, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా అరచేతిలో వైకుంఠం... — అరవై మోసాలతో ప్రజలను మభ్యపెడుతుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సందా వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం న్యూ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. సాయంత్రం నాలుగు గంటలకు జాతర కమిటీ సభ్యులు పోటీలను ప్రారంభించారు. మొత్తం తొమ్మిది జతల ఎద్దులు పాల్గొనగా మొదటి స్థానంలో నాగర్‌కర్నూల్‌కు చెందిన వెంకటేశ్వర్‌రావు ఎద్దులు, రెండోస్థానంలో హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎద్దులు, మూడోస్థానంలో గద్వాలకు చెందిన జయమ్మ వీరాంజనేయులు ఎద్దులు, నాలుగో స్థానంలో గద్వాల మండలం భీంపురం గ్రామానికి చెందిన వడ్డెమాన్ సుధాకర్‌రెడ్డి ఎద్దులు, నారాయణపేటకు చెందిన రషీద్‌పాషా ఎద్దులు ఐదోస్థానంలో నిలిచాయి. కన్వీనర్లుగా మందడి చిదంబర్‌రెడ్డి, గోసాయి హరిప్రసాద్ వ్యవహరించారు. పోటీలను తిలకించడానికి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పాన్‌గల్: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. హెచ్‌సీ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన రేగిచెట్టు బాలస్వామి(70) ఫిబ్రవరి 5వ తేదీన ఇంట్లో పొయ్యిపై వేడినీళ్లు పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తుతో పొయ్యిలో పడి ఛాతీ, పొట్ట, చేతులకు గాయాలయ్యాయి. గాయపడిన వృద్ధుడిని జిల్లా ఆస్పత్రిలో 10 రోజుల చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఫిబ్రవరి, 15న ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. బాలస్వామి మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి కుమారుడు సూర్యబాబు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ పేర్కొన్నారు.